క్లుప్తంగా

ఏపీఎస్పీ అడిషనల్ కమాండెంట్‌గా దేవానందరావు



దేవానందరావును అభినందిస్తున్న బెటాలియన్ అధికారులు

కాకినాడ రూరల్: కాకినాడ ఏపీఎస్పీ 3వ బెటాలియన్ అడిషనల్ కమాండెంట్‌గా ఎస్.దేవానందరావు బాధ్యతలు చేపట్టారు. విశాఖపట్నం 16వ బెటాలియన్ నుంచి పదోన్నతిపై వచ్చి శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో అసిస్టెంట్ కమాండెంట్‌గాను, ఆర్ఐగాను కాకినాడలో పనిచేశారు. అడిషనల్ కమాండెంట్‌గా పదోన్నతిపై వచ్చిన దేవానందరావును బెటాలియన్ చుట్టు పక్కన ప్రాంతాలకు చెందిన లింగం రవి, సీహెచ్ వీరకుమార్, డీకేవీ ప్రసాద్, పెదసత్యం తదితరులు శనివారం ఉదయం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేసి అభినందనలు తెలియజేశారు.

బోధనలో వినూత్న పద్ధతులు అవలంబించాలి



సర్టిఫికెట్లు ప్రదానం చేస్తున్న కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు

బాలాజీచెరువు: ప్రస్తుత సాంకేతిక యుగంలో విద్యార్థులు మెరుగైన ఉపాధి అవకాశాలు అందిపుచ్చుకోవాలంటే అధ్యాపకులు బోధనలో వినూత్న మార్పులు తీసుకురావాలని జేఎన్‌టీయూకే ప్రిన్సిపాల్ ఎన్.మోహనరావు పేర్కొన్నారు. జేఎన్‌టీయూకేలో సీఎస్ఈ విభాగం ఆధ్వర్యంలో ఇండస్ట్రీ 4.0 అంశంపై నిర్వహిస్తున్న ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ రామ్మోహనరావు మాట్లాడుతూ ఇటువంటి వర్క్‌షాపుల ద్వారా అధ్యాపకులకు నూతన సాంకేతికత నేర్చుకునేందుకు ఆసక్తి పెరుగుతుందని, భవిష్యత్‌లో ఇటువంటి కార్యక్రమాలు మరిన్ని నిర్వహించాలన్నారు. రిసోర్స్ పర్సన్ డాక్టర్ కె.మురళీకృష్ణ ఇండస్ట్రీ 4.0లో కీలక అంశాలైన ఐఓటీ, ఏఐఎంఎల్ వంటి అంశాలపై వివరించారు. అనంతరం అధ్యాపకులకు, పరిశోధక విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఐటీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ డైరెక్టర్ చక్రవర్తి, సీఎస్ఈ ప్రొఫెసర్ సుమలత, టి.శివరామకృష్ణ, సునీత పాల్గొన్నారు.

ఆర్భాటాలు తగ్గించి సేవా కార్యక్రమాలు చేపట్టండి



బయోకెమిస్ట్రీ ఎన్‌లైజర్ మెషీన్ అందిస్తున్న సామా రమేష్

బోట్‌క్లబ్: ఇంటిలో జరిగే శుభకార్యాలకు అనవసరంగా డబ్బులు వృథా చేసి ఆర్భాటాలు చేయకుండా సామాజిక సేవా కార్యకమాలు నిర్వహించాలని లయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్ కుమార్ అన్నారు. స్థానిక ఎస్ఎఫ్‌సీఎల్ రోడ్డులోని డాక్టర్ బాదం బాలకృష్ణ క్లినికల్ ల్యాబ్‌కు సామా రమేష్ తన పుట్టిన రోజు సందర్భంగా శనివారం రూ.1.40 లక్షల విలువ గల బయోకెమిస్ట్రీ ఎనలైజర్ మెషీన్‌ను బహూకరించారు. క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ శుభకార్యాలకు అనవసరంగా ఖర్చు చేసే డబ్బులు సేవా కార్యక్రమాలు ఉపయోగిస్తే ఎంతో మంది నిరుపేదలకు ఉపయోగంగా ఉంటుందన్నారు. మిషన్ అందించిన సామా రాజేశ్వరి, రాజేష్ దంపతులను ఆయన అభినందించారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సంకల్ప్ అధ్యక్షురాలు సమయమంతుల లక్ష్మీ లావణ్య, రీజనల్ చైర్మన్ రాజేశ్వరి, సభ్యులు పున్నమరాజు, మెట్టా రాధ, సీతారామరాజు పాల్గొన్నారు.

పిజ్జా బర్గర్లకు దూరంగా ఉండాలి



అవగాహన కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎముకల వైద్య నిపుణులు సూర్యారావు

బోట్‌క్లబ్ : పిజ్జా, బర్గర్, ఫాస్ట్ ఫుడ్స్‌కు పిల్లలు దూరంగా ఉండాలని ప్రముఖ ఎముకలు వైద్య నిపుణులు బొండా సూర్యారావు అన్నారు. స్థానిక భానుగుడి వద్ద ఉన్న సన్ రైజ్ ఆసుపత్రిలో శనివారం ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రపంచ ఆరోగ్య సంరక్షణ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అవగాహన కార్యక్రమం, ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. అసోసియేషన్ రాష్ట్ర కన్వీనర్ అద్దాల మాట్లాడుతూ ప్రపంచ పీడియాట్రిక్ బోన్ అండ్ జాయింట్ డే అనేది పిల్లలలో కండరాల పరిస్థితుల ప్రభావం గురించి అవగాహన కల్పించడానికి ప్రతి సంవత్సరం అక్టోబర్ 19వ తేదీన జరుపుకొనే ప్రపంచ ఆరోగ్య సంరక్షణ కార్యక్రమన్నారు. అసోసియేషన్ అధ్యక్షుడు నాగేంద్ర, సభ్యులు చైతన్య, సిరాజ్ పాల్గొన్నారు.

చెలరేగిన రాజకీయ చిచ్చు

- లారీ యూనియన్ల మధ్య ఆధిపత్య పోరు
- ఇరు వర్గాలకు కూటమి ఎమ్మెల్యేల దన్ను
- రెండుగా చీలిపోయిన వైనం



లారీయూనియన్‌లో ఉన్న లారీలు

కాకినాడ: ఒకప్పుడు ఐక్యతకు మారుపేరుగా ఉన్న లారీ యూనియన్‌లో రాజకీయ చిచ్చు రేగింది. సమర్థవంతమైన నిర్వహణ ద్వారా రాష్ట్ర చరిత్రలోనే ఇతర యూనియన్లకు ఆదర్శంగా నిలిచిన కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ చుట్టూ వివాదాలు చుట్టుముట్టాయి. కూటమి ప్రభుత్వంలోని తెలుగుదేశం, జనసేన పార్టీలకు చెందిన కాకినాడ సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు వనమాడి వెంకటేశ్వరరావు, పంతం నానాజీ మద్దతుతో యూనియన్ రెండుముక్కలైంది.

ఇదీ పరిస్థితి

కాకినాడ సిటీ, రూరల్ నియోజకవర్గాల పరిధిలోని లారీ ఓనర్స్ అంతా ఇంత కాలం కాకినాడ లారీ ఓనర్స్ అసోసియేషన్ గొడుగు కిందే ఉండేవారు. ఇక్కడి అసోసియేషన్‌లో సుమారు 1500 మంది సభ్యులు, మూడు వేల లారీలు ఉన్నాయి. రవాణా రంగంలో కాకినాడ ప్రాంతం కీలకంగా ఉండడంతో ఇక్కడి లారీలకు ఒకప్పుడు చేతినిండా పని ఉండేది. లారీ ఓనర్లు అందరికీ ఇక్కడ అమలు చేసే సీరియల్ విధానం ఇతర సంఘాలకు కూడా ఆదర్శంగా ఉండేది. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కాకినాడ సిటీ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు తనకు నచ్చిన వ్యక్తులతో కొత్త కమిటీని ఏర్పాటు చేశారు. కొండబాబు పర్యవేక్షణలోని నూతన లారీ యూనియన్ ఏక పక్ష విధానాలతో మెజార్టీసభ్యులు తీవ్రంగా విభేదించారు. ప్రధానంగా కమిటీకి, అసోసియేషన్‌కు సీక్రెట్ పద్ధతిలో ఓటింగ్‌కు అవకాశం కల్పించాలంటూ మెజార్టీ సభ్యులు డిమాండ్ చేస్తున్నారు.

కొత్త యూనియన్ రిజిస్ట్రేషన్

కొత్త కమిటీ వనమాడి మద్దతుగా అరాచకంగా వ్యవహరిస్తుందంటూ విభేదించిన మెజార్టీ సభ్యులు యూనియన్ నుంచి విడిపోయేందుకు సిద్ధమయ్యారు. ఇంతకాలం ఐక్యతతో పనిచేసే లారీ యూనియన్ ఇప్పుడు రెండు ముక్కలైంది. విడిపోయిన రెండో యూనియన్ ఇప్పటికే కాకినాడ రూరల్ పరిధితో మరో యూనియన్ పేరుతో మరో రిజిస్ట్రేషన్ చేయించారు. జనసేన రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ మద్దతు ఉందంటూ వీడిపోయిన వర్గం బాహాటంగానే చెబుతోంది. ప్రత్యక్షంగా, పరోక్షంగా వేలాది మందికి ఉపాధి కల్పించే లారీ యూనియన్ రెండుగా చీలిపోవడం, ఆ రెండు వర్గాలకు సిటీ, రూరల్ ఎమ్మెల్యేలు మద్దతుగా నిలవడం యూనియన్ వర్గాలను ఆందోళనకు గురిచేస్తోంది. యూనియన్ వివాదాల్లో అధికార పార్టీ ఎమ్మెల్యేలు జోక్యం చేసుకుని కార్మికుల ఐక్యతను దెబ్బతీసే విధంగా వ్యవహరిస్తున్నారంటూ మెజార్టీ లారీ ఓనర్లు గగ్గోలు పెడుతున్నారు. ఇటువంటి విధానాలకు సదరు ఎమ్మెల్యేలు స్వస్థి పలికి రవాణా రంగంలో ఎంతోకీలకంగా ఉండిన పేరు ప్రతిష్టలు పొందిన కాకినాడ లారీ ఓనర్స్ యూనియన్ అసోసియేషన్‌ను ప్రతిష్టను మంటగలపొద్దంటూ కోరుతున్నారు. సీక్రెట్ పద్ధతిపై ఓటింగ్ నిర్వహించి నచ్చిన వారిని ఎన్నుకుని యూనియన్‌ను నిర్వహించుకునే వెసులుబాటు కల్పిస్తే అన్ని వర్గాలకు ఆమోదయోగ్యంగా ఉంటుందంటూ మెజార్టీ సభ్యులు చెబుతున్నారు. వివాదం ముగియనున్న నేపథ్యంలో ఇద్దరి నాయకుల మధ్య కొంత మంది నేతలు సయోధ్యకు తిర్చే పనిలో ఉన్నారు.

కంప్యూటరీకరణ పనులు త్వరగా పూర్తి చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న జేసీ రాహుల్‌మీనా

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): జిల్లాలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల వివరాలు కంప్యూటరీకరణ పనులు వేగవంతం చేయాలని జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా అధికారులను ఆదేశించారు. శనివారం సహకార సంఘాల వివరాల కంప్యూటరీకరణ పనుల పురోగతిపై కలెక్టర్ కార్యాలయంలో జిల్లా సహకార బ్యాంకు మేనేజర్లు, సహకార సంఘ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. రైతుల వివరాలన్నీ ఆన్‌లైన్‌లో పొందుపరచాలన్నారు. ఈ పనులు వారం రోజుల్లో పూర్తి కావాలని అధికారులను ఆదేశించారు. కేవైసీ వివరాలు దొరకని రైతుల వివరాలను బ్యాంకు మేనేజర్లు, సూపర్‌వైజర్లు ప్రత్యేక దృష్టి పెట్టి అక్టోబర్ చివరి నాటికి ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. ఈ సమావేశంలో డీసీసీబీ సీఈఓ ఆర్‌వీ నరసింహారావు జిల్లా సహకార అధికారి జి.వెంకటకృష్ణ, కాకినాడ డివిజనల్ కోఆపరేటివ్ అధికారి బి.దుర్గాప్రసాద్ పాల్గొన్నారు .

భూ సమస్యల పరిష్కారానికే గ్రామ సభలు



గ్రామసభలో మాట్లాడుతున్న ఏడీ రవిశంకర్

కరప: గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికే రీ–సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నట్టు తహసీల్దార్ ఎస్.సత్యనారాయణ తెలిపారు. మండలంలోని పాతర్లగడ్డలో శనివారం గ్రామ సర్పంచ్ నాగిరెడ్డి ఏసుబాబు అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. గ్రామంలో నిర్వహించే సర్వేలో రైతులు దగ్గరుండి తమ భూములను సమగ్రంగా సర్వే చేయించుకుని, తమ డాక్యుమెంట్లు, పాస్‌బుక్‌లలో ఏమైనా లోపాలుంటే సరిచేయించుకోవాలన్నారు. ఏడీ రవి శంకర్ మాట్లాడుతూ రైతులు తమ భూములకు సంబంధించిన లోపాలను, తేడాలను సరిదిద్దేందుకు ప్రభుత్వాదేశాల మేరకు నిర్వహిస్తున్న రీ–సర్వే గ్రామ సభలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా రైతుల నుంచి 9 అర్జీలు వచ్చాయి. అందులో భూముల విస్తీర్ణంలో తేడాలు సరిచేయాలని, మరో నాలుగు ఫిర్యాదులు పేర్లలో తప్పుల సవరించాలని కోరినట్టు తహసీల్దార్ సత్యనారాయణ తెలిపారు. డీఐఓఎస్ కె.అప్పారావు, మండల సర్వేయర్ ఎస్.రూపవతి, రీసర్వే డీటీ ప్రసాద్, ఆర్ఐ పవన్‌కుమార్, వీఆర్వో మేడిశెట్టి కిశోర్ తదితరులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మోజులో పడితే ఇబ్బందులే



అవగాహన కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న లక్ష్మీనారాయణ

బోట్‌క్లబ్: యువత సెల్‌ఫోన్ మోజులో పడితే చాలా ఇబ్బందులు వస్తాయని సీబీఐ మాజీ జాయింట్ డైరెక్టర్ లక్ష్మీనారాయణ అన్నారు. స్థానిక సూర్య కళామందిరంలో శనివారం లయన్స్ క్లబ్ కాకినాడ గోల్డెన్‌జూబ్లీ ఆధ్వర్యంలో స్ఫూర్తి పేరుతో విద్యార్థుల వ్యక్తిత్వ వికాసంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని లక్ష్మీనారాయణ జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. యువత సెల్‌ఫోన్‌లో రీల్స్‌కు అలవాటు పడిపోయారని దీనివల్ల వారి ఏకాగ్రత పడిపోయిందన్నారు. యువత జీవితంలో ఉన్నత స్థితిలో స్థిర పడాలంటే సమయం అస్సలు వృథా చేయకూదన్నారు. పోటీపడి చదివి ఉద్యోగాలు సాధించాలని తెలిపారు. లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ బాదం బాలకృష్ణ మాట్లాడుతూ యువత ఉన్నతంగా ఎదిగేందుకు ఇటువంటి క్లాస్‌లు ఎంగానో ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులకు క్రమశిక్షణ ఎంతో అవసరమని చెప్పారు. వ్యక్తిత్వ వికాస నిపుణురాలు పద్మావతి మాట్లాడుతూ మన ఆలోచన విధానం చాలా ఉన్నతంగా ఉండాలన్నారు. జీవితంలో కింది స్థాయి నుంచి పైకి వచ్చిన వ్యక్తులను ఆదర్శంగా తీసుకోవాలన్నారు. లయన్స్‌క్లబ్ గవర్నర్ ఈశ్వర్‌కుమార్ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో క్లబ్ మాజీ గవర్నర్‌లు సూర్యనారాయణ, క్లబ్ అధ్యక్షుడు ప్రకాష్, వైస్ గవర్నర్‌లు వజ్రపు కోటేశ్వర్రావు, చిట్నీడి శ్రీనివాస్, మెట్టా రాధ, క్లబ్ సెక్రటరీ వీవీ రమణ, ట్రెజరర్ అనిల్‌కుమార్, సభ్యులు చెక్కా ప్రకాష్, రమణమూర్తి పాల్గొన్నారు.

ఘనంగా కుంకుమ పూజలు



సాయిబాబా ఆలయంలో కుంకుమ పూజలు చేస్తున్న మహిళలు

కాకినాడ రూరల్: రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీ శ్రీ షిరిడి సాయిబాబా పుణ్యతిథి నవరాత్ర మహోత్సవాల్లో భాగంగా సామూహిక కుంకుమ పూజలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు పి.ఉదయ భాస్కర్ మాట్లాడుతూ ఈ నెల 12 నుంచి 20 వరకూ ఉత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. నారాయణ శర్మ మాట్లాడుతూ వచ్చే నెల 21న కార్తీకమాస పర్వదినం సందర్భంగా బాబా వారి సన్నిధిలో మహా అన్నదానం నిర్వహించనున్నట్టు తెలిపారు. ఈ కుంకుమ పూజలో పెద్ద ఎత్తున మహిళలు పాల్గొన్నారు.

రతన్ టాటా సేవలు మరువలేనివి



నిరుపేదలకు అన్నదానం చేస్తున్న శివశంకర్, సుబ్బు తదితరులు

బోట్‌క్లబ్: టాటా గ్రూప్ ఆఫ్ ఇండస్ట్రీస్ అధినేత రతన్ టాటా దేశానికి అందించిన సేవలు ఎన్నటికీ మరువలేనివని సానా సతీష్ బాబు ఫౌండేషన్ చైర్మన్ తలాటం హరీష్ అన్నారు. స్థానిక మునసబు గారి వీధిలోని హరీష్ స్పోర్ట్స్ వద్ద శనివారం రతన్ టాటా సంతాప సభ నిర్వహించారు. కరోనా సమయంలో వాక్సిన్ కోసం కోట్లాది రూపాయలు విరాళంగా అందించిన మహోన్నతమైన వ్యక్తి రతన్ టాటా అని కొనియాడారు. శివశంకర్ టాటా షోరూం జనరల్ మేనేజర్ సుబ్బు మాట్లాడుతూ రతన్ టాటా ఎన్నో కంపెనీలు ఏర్పాటు చేసి లక్షలాది మందికి ఉపాధి కల్పించారన్నారు. ఈ సందర్భంగా నిరుపేదలకు అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ మాజీ గవర్నర్ మాదిరెడ్డి బాబూజీ రావు, పిడక శేషు, పెనిశెట్టి సురేష్, పెద్దిరెడ్డి రమేష్, మణికంఠ పాల్గొన్నారు.

నీటి సంఘాల ఎన్నికలపై ప్రత్యేక దృష్టి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ షణ్మోహన్ సగిలి

బోట్‌క్లబ్(కాకినాడ సిటీ): జిల్లాలోని నీటి సంఘాల ఎన్నికల నిర్వహణపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ షణ్మోహన్ సగిలి అధికారులను ఆదేశించారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. రాష్ట్ర ప్రభుత్వం మార్గదర్శకాలు మేరకు జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లు చేయాలన్నారు. జిల్లాలో గోదావరి, ఏలూరు, పంపా, సుబ్బారెడ్డి సాగర్ ఆయకట్టు నీటి సంఘాల్లో ఉన్న రైతుల వివరాల జాబితా సిద్ధం చేయాలన్నారు. తూర్పు ఆయకట్టు కింద నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు అవసరమైన ప్రాదేశిక నియోజకవర్గం పరిధి నిర్ణయించేందుకు ఇరిగేషన్ రెవెన్యూ అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. మండల స్థాయిలో అధికారులను సమన్వయం చేసుకుంటూ నిర్ణయించిన గడువు లేక జిల్లాలో నీటి సంఘాల ఎన్నికల నిర్వహణకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, జిల్లా రెవెన్యూ అధికారి తిప్పే నాయక్, ఇరిగేషన్ ఎస్ఈ జి.శ్రీనివాసరావు, కాకినాడ పెద్దాపురం డీఈలు పాల్గొన్నారు .

పర్యావరణ పరిరక్షణలో రోటరీ ముందంజ



చిన్నారులకు పౌష్టికాహారం పంపిణీ చేస్తున్న రోటరీ గవర్నర్ వెంకటేశ్వరరావు

బోట్‌క్లబ్: పర్యావరణ పరిరక్షణలో రోటరీ క్లబ్ ఎప్పుడూ ముందుంటుందని రోటరీ గవర్నర్ డాక్టర్ ఎం.వెంకటేశ్వరరావు పేర్కొన్నారు. రోటరీ ఫౌండేషను విరాళాలు అందించడం ద్వారా క్లబ్ చేపట్టే శాశ్వత ప్రాజెక్టులకు రోటరీ ఫౌండేషన్ ద్వారా పెద్ద మొత్తంలో నిధులు సేకరించవచ్చునన్నారు. రోటరీ క్లబ్ కాకినాడ గోల్డెన్ జూబ్లీ అధికార పర్యటనలో భాగంగా శనివారం కాకినాడ భానుగుడి సెంటర్లో ఏర్పాటు చేసిన పర్యావరణ పరిరక్షణలో భాగంగా చేపట్టిన మొక్కల పంపిణీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. బాటసారులకు మొక్కలను పంపిణీ చేశారు. అనంతరం కల్పన సెంటర్‌లో ఉన్న ఎస్ఎంఎస్ రోటరీ హాల్‌లో రోటరీ బ్లడ్ బ్యాంక్‌ను సందర్శించారు. పాల్ హారీస్ విగ్రహానికి పుష్పాంజలి ఘటించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో భాగంగా ఏర్పాటు చేసిన పౌష్టికాహారం పంపిణీ చేశారు. అసిసెంట్ గవర్నర్ ధనసాగర్ ప్రసాద్, క్లబ్ అధ్యక్షుడు శ్రీకాంత్, క్లబ్ సభ్యులు కృష్ణకుమారి, ఉషారాణి, రోటరీ ఫౌండేషన్‌కు విరాళం చెక్కులను అందజేశారు. ఈ కార్యక్రమంలో క్లబ్ సర్వీస్ డైరెక్టర్ నెక్కంటి శ్రీనివాస్, మాజీ గవర్నర్ ఎస్‌వీఎస్ రావు, క్లబ్ సభ్యులు చార్మినార్ వర్మ పాల్గొన్నారు.

మాకు న్యాయం చేయండి

- తరచూ విచారణ పేరుతో కాలయాపన చేయవద్దు
- కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ బాధితుల ఆవేదన



సొసైటీ అవినీతిపై విచారణ చేస్తున్న మురళీకుమార్

బోట్ క్లబ్(కాకినాడ సిటీ): ఎక్కువ వడ్డీకి ఆశపడి కోట్లాది రూపాయలు డిపాజిట్ చేసి తాము నిండా మునిగిపోయామని బాధితులు వాపోయారు. కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీలో రూ.22 కోట్లు డిపాజిట్ చేస్తే కొన్ని రోజులపాటు సక్రమంగా వడ్డీ చెల్లించి గత సంవత్సరం బోర్డు తిప్పేసిన సొసైటీ సభ్యుల ఆస్తులను జప్తు చేసి తమ డబ్బులు ఇవ్వాలని బాధితులు సహకారశాఖ అధికారులను కోరారు. శనివారం స్థానిక డీసీసీబీ కార్యాలయంలో సహకార శాఖ ఓఎస్ డీ మురళీకుమార్ ఆధ్వర్యంలో కార్తికేయ కో–ఆపరేటివ్ బిల్డింగ్ సొసైటీ అవినీతిపై విచారణ చేపట్టారు. ఈ సందర్భంగా 353 మంది డిపాజిట్‌దారుల నుంచి ఆయన స్టేట్మెంట్ రికార్డ్ చేశారు. బ్యాంకు సభ్యులు గతంలో డిపాజిట్ చేసిన వారికి ఇచ్చిన పత్రాలు నకిలీవని చెప్పడం చాలా బాధాకరమని పలువురు సభ్యులు విచారణ అధికారి వద్ద తమ ఆవేదన వ్యక్తం చేశారు. రూ.22 కోట్లు అవినీతికి పాల్పడి ప్రస్తుతం రూ.10 కోట్లు మాత్రమే డిపాజిట్లు తీసుకున్నామని చెప్పడంతో అమానుషమని, ఇప్పుడు తమ పరిస్థితి ఏమిటని పలువురు డిపాజిట్‌దారులు మనోవేదనను విచారణ అధికారికి తెలియజేశారు. తరచూ విచారణ పేరుతో సభ్యుల స్టేట్మెంట్ రికార్డ్ చేయడం తప్ప అధికారులు తమకు డబ్బులు ఎప్పుడు ఇస్తారో చెప్పడంలేదని పలువురు సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. కష్టపడి సంపాదించిన డబ్బులు పిల్లలకు చదువులకు, పెళ్లిళ్లకు ఉపయోగపడతాయని దాచుకుంటే మోసం చేశారని, ఇప్పుడు అవసరానికి ఒక్క రూపాయి కూడా చేతిలో లేకుండా పోయిందని బాధితులు కన్నీటి పర్యంతమయ్యారు.

బాధితులకు 'కోరమాండల్' చేయూత



నిత్యావసర సరకులు పంపిణీ చేస్తున్న మల్లీశ్వరి తదితరులు

కాకినాడ రూరల్: రమణయ్యపేట అడబాల ట్రస్ట్ కార్యాలయంలో కోరమండల్ మహిళ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా క్లబ్ కార్యదర్శి మల్లీశ్వరి మాట్లాడుతూ తమ క్లబ్ అధ్యక్షురాలైన వెంకట దుర్గావతి సూచనల మేరకు ప్రతినెలా ప్రాణాంతక వ్యాధిగ్రస్తులకు నిత్యావసర సరకులు అందజేస్తున్నామన్నారు. తోటి వారికి సహాయ పడడం ద్వారా సేవాభావాన్ని అలవర్చుకొని అర్థవంతమైన జీవితాన్ని గడపడం ప్రతి ఒక్కరి బాధ్యతగా పేర్కొన్నారు. ఆర్ట్ ఆఫ్ లివింగ్ ప్రతినిధి జి.కృష్ణమోహన్ మాట్లాడుతూ ఒకవైపు కుటుంబ బాధ్యతలను నిర్వర్తిస్తూనే సమాజ సేవ చేస్తున్న కోరమండల్ మహిళా సంక్షేమ సంఘ సభ్యులు అభినందనీయులన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీదేవి, ఆలీ అవర్, అడబాల రత్న ప్రసాద్, రాజా తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కరప: కొబ్బరి చెట్టుపై నుంచి ప్రమాదవశాత్తు జారిపడి కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శనివారం ఓ వ్యక్తి మృతి చెందినట్టు కరప పోలీసులు తెలిపారు. వారు తెలిపిన వివరాల ప్రకారం.. రామచంద్రపురం కాపవరం గ్రామానికి చెందినపిల్లి శ్రీనుగణేష్ (35) కొబ్బరి దింపు కార్మికుడిగా పనిచేస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఈ నెల పదో తేదీన కరప మండలం యండమూరు శివారు వడ్డిపాలెం గ్రామంలో కొబ్బరి చెట్టు ఎక్కి కొబ్బరి కాయలు దించుతుండగా ప్రమాదశాత్తు కొబ్బరిచెట్టు నుంచి పడి తీవ్రంగా గాయపడ్డారు. రైతు వనుం బాబు క్షతగాత్రున్ని కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించి వైద్యం అందించారు. అయితే చికిత్స పొందుతూ శనివారం మృతి చెందినట్టు పోలీసులు చెప్పారు. మృతుని భార్య పద్మావతి ఫిర్యాదు మేరకు కరప ఎస్ఐ తోట సునీత కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పాముకాటుకు ఎనిమిదేళ్ల చిన్నారి మృతి

కరప: సిరిపురం గ్రామంలో శనివారం ఉదయం పాము కాటుకు గురై ఎనిమిదేళ్ల చిన్నారి మృతి చెందింది. కరప పోలీసులు కథనం ప్రకారం.. సిరిపురం ఎస్సీ పేటకు చెందిన పూలపల్లి నాగరాజు కుమార్తె ఉషశ్రీ(8) స్థానిక ప్రభుత్వ పాఠశాలలో రెండో తరగతి చదువుతోంది. ఉదయం ఉషశ్రీకి విపరీతమైన జ్వరం, ఫిట్స్‌తో బాధపడుతుండగా కంగారుపడిన తల్లిదండ్రులు 108లో కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఉషశ్రీని పరీక్షించిన వైద్యులు గుర్తుతెలియని పాము ఆమె ఎడమ కాలిపై కాటువేసినట్టు అనుమానం వ్యక్తం చేశారు. చికిత్స పొందుతూ శనివారం రాత్రి మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరంచారు. నాగరాజు పారిశుద్ధ్య కార్మికుడిగా పనిచేస్తుండగా, తల్లి కువైట్‌లో ఉంటుంది. వీరికి సంతానం లేకపోవడంతో హైదరాబాద్‌లో ఉంటున్న తన సోదరి కుమార్తెను పెంచుకొన్నట్టు పోలీసులు తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

భక్తిశ్రద్ధలతో అట్లతద్దె పూజలు



సర్పవరం భావనారాయణ స్వామి ఆలయం కోనేరు వద్ద పూజలు చేస్తున్న మహిళలు

కరప: గ్రామాల్లో శనివారం మహిళలు అట్లతద్దె పూజా కార్యక్రమాలను భక్తి శ్రద్ధలతో వేడుకగా నిర్వహించారు. కొత్తగా పెళ్లయినా వారు, మహిళలు తెల్లవారు జామున లేచి, తలస్నానమాచరించి, భోజనాలు చేసి అట్ల తద్దో ఆరు అట్లో, ముద్దపప్పో మూడు అట్లో అంటూ వీధుల్లో కలియ తిరుగుతూ ఆటపాటలతో సందడి చేశారు. సాయంత్రం బావులవద్ద, కాలువగట్ల వద్ద గౌరీ పూజ చేశారు. 11 వాయినాల అట్లతోను, జాజాలతో భక్తిశ్రద్ధలతో పూజలు చేశారు. కొత్తగా పెళ్లయినవారు పేరంటాళ్లకు వాయినాలిచ్చి ఆశీర్వాదం తీసుకున్నారు.

కోనేరుల వద్ద సందడి

కాకినాడ రూరల్: అట్లతద్దె నోము మహిళలు భక్తి శ్రద్ధలతో శనివారం ఆచరించారు. వేకువ జామునే నిద్ర లేచి తలారా స్నానాలు ఆచరించి, తద్దె భోజనం చేసి సాయంత్రం వరకు ఉపవాసాలు గౌరీ దేవికి అట్లు వాయినాలుగా సమర్పించి పూజలు నిర్వహించారు. యువతులు ముత్తైదువులకు తాంబులాలు ఇవ్వగా, కొత్త పెళ్లయిన వారు వాయినాలను ముత్తైదువులకు ఇచ్చిన వారి ఆశీస్సులు పొందారు. సాయంత్రం కోనేరులు, చెరువులు వద్ద పూజలు నిర్వహించడంతో సందడి నెలకొంది. సర్పవరం భావనారాయణ స్వామి ఆలయం వద్ద పుష్కరిణి వద్ద గౌరీ దేవీని పూజించారు.



కరపలో కాలువగట్టు వద్ద గౌరీదేవికి పూజలు చేస్తున్న మహిళలు

సమస్యల పరిష్కారమే ప్రభుత్వ ధ్యేయం

కరప: ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించడమే ప్రభుత్వ ధ్యేయమని కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ పేర్కొన్నారు. పల్లెపండుగ–వారోత్సవాల్లో భాగంగా శనివారం కరప శివారు పేపకాయలపాలెంలో గ్రామ సర్పంచ్ సాదే ఆశాజ్యోతి అధ్యక్షతన జరిగిన గ్రామసభలో ఆయన మాట్లాడారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి పవన్‌కల్యాణ చొరవతో ఆగస్టులో ఒకే రోజు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామసభలు నిర్వహించి, ప్రజలకు అవసరమైన పనులు గుర్తించామన్నారు. వాటి సంబంధించి నిధులు కేంద్రం నుంచి మంజూరయ్యాయని తెలిపారు. రైతుల భూ సమస్యల పరిష్కారానికి రీ–సర్వే గ్రామ సభలు నిర్వహిస్తున్నామని, వాటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ముందుగా రూ.21 లక్షలతో నిర్మించే సీసీ రోడ్లకు శిలాఫలకాన్ని ఎమ్మెల్యే ఆవిష్కరించారు. అనంతరం పెనుగుదురు, నడకుదురు, ఉప్పలంక తదితర గ్రామాల్లో ఎమ్మెల్యే నానాజీ పర్యటించి పల్లెపండుగ–వారోత్సవాల్లో సీసీ రోడ్లు, లింకురోడ్లకు భూమిపూజ చేసి, శిలాఫలకాలు ఆవిష్కరించారు. ఎంపీడీఓ ఎం.అనుపమ, డ్వామా ఏపీడీ వసంతమాధవి, ఏపీఓ ఈ.వెంకటరమణ, ఈఓపీఆర్డీ ఎస్.శ్రీనివాసరావు, నాయకులు పాల్గొన్నారు.